క్లుప్తంగా

క్రమబద్ధీకరణ ప్రక్రియ కొనసాగించాలి



పసుపు రిబ్బన్లు ధరించి నిరసన తెలియజేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు

రొద్దం: గత రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులర్ చేసేందుకు నిర్ణయం తీసుకొని జీఓ నంబర్ 114ను విడుదల చేసింది. కాంట్రాక్ట్ లెక్చరర్ల క్రమబద్ధీకరణ ప్రక్రియను కొనసాగించాలి'. అని ప్రభుత్వ జూనియర్ కళాశాల కాంట్రాక్టు అధ్యాపకులు డిమాండ్ చేశారు. ఇందులో భాగంగానే సోమవారం మండల కేంద్రంలోని జూనియర్ కళాశాల వద్ద పసుపు రిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. గత ప్రభుత్వం జీఓ విడుదల చేసి ప్రక్రియను దాదాపుగా పూర్తి చేసిందన్నారు. ఇంతలో ఎన్నికల కోడ్ రావడంతో అంతరాయం ఏర్పడిందని చెప్పారు. ఈ ప్రక్రియను కొనసాగిస్తామని టీడీపీ ప్రభుత్వం చెప్పిందన్నారు. చెప్పిన విధంగా త్వరగా ప్రక్రియ పూర్తి చేయాలన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం



ఆత్మహత్యాయత్నం చేసిన వెంకటేష్

హిందూపురం అర్బన్: హిందూపురం పట్టణంలోని బోయపేటలో నివాసం ఉంటున్న వెంకటేష్ అనే వ్యక్తి సోమవారం ఉదయం గొంతుకోసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ కలహాలే ఇందుకు కారణమని తెలుస్తోంది. వెంటనే చుట్టు పక్కల ఇళ్ల వారు గమనించి హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

కూలిన మర్రిచెట్టు



నేలకొరిగిన మర్రి చెట్టు

రొళ్ల: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణం వెనుక భాగంలో ఉన్న ఏళ్లనాటి మర్రి చెట్టు నేల కూలింది. ఆదివారం రాత్రి రొళ్ల మండల వ్యాప్తంగా మోస్తరు వర్షం కురిసింది. ఈ నేపథ్యంలో మర్రి చెట్టు ఎంపీడీఓ కార్యాలయం పక్కకు కూలడంతో కార్యాలయం చుట్టు ఏర్పాటు చేసిన ప్రహరీ ఒకచోట దెబ్బతింది. ఎంపీడీఓ కార్యాలయం భవనంపైకి చెట్టు కొమ్మలు వాలాయి. ఎంపీడీఓ కార్యాలయ భవనం వైపు కాకుండా ఈ పక్కన పోలీసుస్టేషన్‌నే పడి ఉంటే భవనం దెబ్బతినేదని, కార్యాలయ వేళల సమయంలో చెట్టుపడి ఉంటే పెనుప్రమాదం జరిగి ఉండేదని స్థానికులు తెలిపారు.

అన్న క్యాంటీన్ ప్రారంభం



అన్న క్యాంటీన్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిర: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణంలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను సోమవారం స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్ రాజు దంపతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టిఫిన్, భోజనం అతి తక్కువ ధరకు అన్న క్యాంటీన్‌లో ప్రజలకు అందుబాటులో ఉంటుందని, అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ వెంకటలక్ష్మమ్మ, మున్సిపల్ కమిషనర్ రంగస్వామి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి భూమి పూజ..

మడకశిరరూరల్: మండల పరిధిలోని గొడనహళ్లి గ్రామంలో సోమవారం నిర్వహించిన పల్లె పండుగ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలోని హరీష్ ఇంటి నుంచి ఇందిరమ్మ కాలనీ వరకూ ఉపాధి హామీ పథకం కింద రూ.10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మిస్తున్నామని తెలిపారు. సర్పంచ్ పుట్టమ్మ, ఏపీడీ లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ సోనిబాయి, కార్యదర్శి సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ పతనమైన టమాట ధర

- మొన్నటి దాకా కేజీ రూ.50 నుంచి రూ.80 పలికిన వైనం
- నేడు కేజీ రూ.10 నుంచి 20కి పడిపోవడంతో అన్నదాతల ఆందోళన

పెనుకొండ రూరల్: టమాట ధరలు మళ్లీ పతనమయ్యాయి. మొన్నటి దాకా టమాట కేజీ రూ.50 నుంచి రూ.80 దాకా పలికాయి. అయితే తాజాగా ఉన్నఫలంగా ధరలు పడిపోయాయి. ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా ధరలు పడిపోయాయని రైతులు చెబుతున్నారు.

ఎకరాకు రూ.50 వేల పెట్టుబడి


టమాట ఎకరా పంట సాగుకు రూ. 50 వేల పైబడి ఖర్చు చేసి పంట పండించారు. పంట చేతికి వచ్చే సమయంలో ఇటీవల కురుస్తున్న వర్షాలకు పెట్టిన పెట్టుబడి గిట్టుబాటు అయ్యేలా లేకపోవడంతో కర్షకులు డీలా పడ్డారు. సరిహద్దు ప్రాంతాల్లో హోల్‌సేల్ మార్కెట్లో 14 కిలోల బాక్స్ ధర రూ.150 నుంచి రూ.210 వరకు ధర పలుకుతుంది. పంట కోసేందుకు కూలీలకు కూలి రూ.200 , ట్రాన్స్‌పోర్ట్ చార్జీలు ఒక్కో బాక్స్‌కు రూ.40 చెల్లించాల్సి ఉంది. దళారీల కమీషన్ పోను రైతుకు మిగిలే ఆదాయం అంతంత మాత్రమే. స్థానిక మార్కెట్‌ల్లో కిలో టమోట ధర రూ.10 రూపాయల నుంచి రూ. 20 వరకూ పలుకుతోంది. నియోజక వర్గాల వారీగా వందల ఎకరాల్లో టమాట సాగు చేసిన రైతన్నల ఆశలపై వర్షాలు ప్రభావం చూపాయి. రైతు గిట్టుబాటు ధర లభించకపోవడంతో చేసేది ఏమి లేక వచ్చిన కాటికే అమ్ముకుంటున్నారు. మరికొందరు టమాట పంటను నష్టానికి మార్కెట్‌కు తరలించలేక మిన్నకుండి పోతున్నారు.



మార్కెట్‌కు తరలించటానికి బాక్స్‌ల్లో సిద్ధంగా ఉన్న టమాట

టమాట సాగు ఇలా...

నియోజక వర్గం	సాగులో ఉన్న ఎకరాలు
పెనుకొండ	236 ఎకరాలు
మడకశిర	337 ఎకరాలు
హిందూపురం	350 ఎకరాలు



పంట కోసి రాసిగా పోసిన దృశ్యం

పెట్టుబడి చేతికి వచ్చింది



ఒక ఎకరం టమాట సాగు చేశాను. దాదాపుగా రూ.50 వేలకు పైబడి పెట్టుబడి పెట్టాను. అయితే సరైన ధరలు లేకపోవడంతో ట్రాన్స్‌పోర్ట్, కూలీలు కమీషన్లకే అధిక శాతం డబ్బులు చెల్లించాల్సి వస్తోంది. ముందు సగం పంటను అమ్మగా పెట్టిన పెట్టుబడి మాత్రమే వచ్చింది. ఇప్పుడు సరైన ధరలు లేకపోవడంతో, సగం వరకూ పంటను పొలంలోనే వదిలేయాల్సి వచ్చింది.

– రామాంజినప్ప, రైతు, అడదాకులపల్లి

దిగుబడి బాగున్నా..



నేను రెండు ఎకరాల్లో టమాట పంటను పెట్టాను. రూ.3 లక్షల వరకూ పెట్టుబడి అయింది. దిగుబడి బాగున్నా పంట పూర్తి స్థాయిలో చేతికి అందే సమయంలో వర్షాలు పడటంతో ధరలు పడిపోయాయి. దీంతో ఆశించిన స్థాయికి లాభాలు చూడలేకపోయాం. కర్ణాటక రాష్ట్రం చింతామణి, కోలార్ పట్టణాలకు మార్కెట్ కోసం వెళ్లేవాడిని. నష్టానికి పంటను మార్కెట్‌కు తరలించలేక మిన్నకుండిపోయా.

– వెంకటరామిరెడ్డి, రైతు, అడదాకులపల్లి

నలుగురికి గాయాలు

అమరాపురం: మండలంలోని కాచికుంట బైక్ అదుపు తప్పడంతో నలుగురు యువకులు గాయపడ్డారు. స్థానికుల వివరాలమేరకు.. కాచికుంట గ్రామానికి చెందిన తిప్పేస్వామి, భూతరాజు, ఉమేష్, శాంతకుమార్ ఒకే బైకుపై కాచికుంటకు సోమవారం రాత్రి బయలుదేరారు. అయితే బస్టాండు దగ్గర బైక్ అదుపు తప్పి ఓ ఇంటికి ఢీ కొట్టారు. దీంతో తిప్పేస్వామికి తలకు, భూతరాజుకు వీపుపై గాయలు కాగా మరో ఇద్దరు స్వల్పంగా గాయపడినట్లు తెలిపారు. వారిని చికిత్స నిమిత్తం మడకశిరకు తరలించామన్నారు.

రేపు సర్వసభ్య సమావేశం

అమరాపురం: ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఉదయం 10:30 గంటలకు మండల సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ రామరావు తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలన్నారు.

నేటి నుంచి పల్లె పండగ

రొళ్ల: మండలంలో పంచాయతీ వారీగా మంగళవారం నుంచి ఈనెల 19వ తేదీ వరకూ పల్లె పండగ-పంచాయతీ వారోత్సవాల కార్యక్రమాన్ని వివిధ గ్రామాల్లో నిర్వహించనున్నట్లు ఏపీఓ ఓబుళప్ప ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు కథా సంపుటి ఆవిష్కరణ

హిందూపురం టౌన్: హిందూపురం ఎస్‌ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రగతి రచించిన కథా సంపుటి 'కొన్ని చీకట్లు... ఓ వెలుతురూ' ఆవిష్కరణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు సాహితీ స్రవంతి జిల్లా కన్వీనర్ హరి తెలిపారు. సాహితీ స్రవంతి, మహిళా కళాశాల సంయుక్తంగా నిర్వహిస్తున్న కార్యక్రమంలో యోగివేమన విశ్వవిద్యాలయం ఆచార్యులు వినోదిని పుస్తకావిష్కరణ చేస్తారని ప్రిన్సిపాల్ ప్రగతి తెలిపారు.

వ్య.కా.సం నాయకుడి నిలదీత

పెనుకొండ రూరల్: వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ) నాయకుడు బాలస్వామిని మహిళలు నిలదీశారు. గోనిపేట గ్రామానికి చెందిన ప్రజా సమస్యలపై అధికారులకు వినతిపత్రం ఇచ్చేందుకు బాలస్వామి భూ నిర్వాసితులతో కలసి పెనుకొండ ఆర్డీఓ కార్యాలయానికి చేరుకున్నాడు. సోమందేపల్లికి చెందిన అంజనమ్మ, సునీతమ్మ, చౌడమ్మతో పాటు పెద్ద ఎత్తున మహిళలు అక్కడికి చేరుకున్నారు. తమకు పక్కా ఇల్లు నిర్మించి ఇస్తామని డబ్బులు తీసుకున్నారు కదా? అంటూ బాలస్వామిని నిలదీశారు. ఇల్లు కట్టిన రెండు నెలలకే అధికారులు వాటిని కూల్చి వేశారని, తమ డబ్బులు తమకు చెల్లించాలని అతన్ని చుట్టు ముట్టారు. దీనిపై వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు బాలస్వామిని 'సాక్షి' వివరణ కోరగా.. మహిళల ఆరోపణల్లో వాస్తవం లేదని, కమిటీ నిర్ణయం మేరకే పార్టీ కార్యక్రమాలు చేపట్టామన్నారు. కొందరు పనికట్టుకొని దుష్ప్రచారం చేస్తున్నారన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత 'గొడనహళ్లి'



విన్నర్స్ జట్టుకు బహుమతి అందిస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: విజయదశమి సందర్భంగా గొడనహళ్లి గ్రామంలో నిర్వహించిన క్రికెట్ టోర్నీలో గొడనహళ్లి ఫ్రెండ్స్–11 జట్టు విజేతగా నిలిచింది. గొడనహళ్లి డైనమిక్ జట్టు రన్నర్స్‌గా నిలిచినట్లు సోమవారం నిర్వాహకులు తెలిపారు. విజేతలకు షీల్డుతో పాటు నగదు బహుమతిని అందజేశారు. ప్రతి ఒక్కరూ క్రీడలపై ఆసక్తిని పెంపొందించుకోవాలని నిర్వాహకులు తెలిపారు.

వ్యక్తికి గాయాలు



గాయపడిన వ్యక్తి

పావగడ: పట్టణంలోని శిరా రోడ్డులో నిర్మాణంలో ఉన్న భవనం దిమ్మి కూలడంతో ఓ వ్యక్తి సోమవారం సాయంత్రం గాయపడ్డాడు. బస్సు కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికుడు త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నా , తల, కాళ్లు , చేతులకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించారు. సరైన సమయంలో నిర్మాణపు పనులు షాపు యజమాని పూర్తి చేయకపోవడంతో ప్రమాదం జరిగిందని స్థానికులు ఆరోపించారు.

ప్రజలను అప్రమత్తం చేయాలి

లేపాక్షి: భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేయాలని ఏపీఎంపీ ప్రాజెక్ట్ డైరెక్టర్, మండల స్పెషల్ ఆఫీసర్ సుదర్శన్ తెలిపారు. సోమవారం మండలస్థాయి అధికారులతో సమావేశమై పలు సూచనలు, సలహాలిచ్చారు. వర్ష ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు.

ఉరుసు ఉత్సవాలను విజయవంతం చేయండి

హిందూపురం టౌన్: లేపాక్షి మండలంలోని నాగేపల్లి వద్ద వెలిసిన హజరత్ పీర్ భక్తర్ వలి ఉరుసు మహోత్సవం మంగళవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. భక్తులు పెద్ద ఎత్తున ఉత్సవాలకు తరలివచ్చి విజయవంతం చేయాలని దర్గా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మక్తియర్, శ్రీనివాస్‌రెడ్డి తెలియజేశారు. ఇందులో భాగంగానే సోమవారం పట్టణ ప్రముఖులతో పాటు అధికారులను ఉరుసుకు ఆహ్వానించారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి నూరని సందల్ కార్యక్రమం ఉంటుందని, బుధవారం గంధాన్ని పురస్కరించుకొని జాతీయ సమైక్యత సదస్సును నిర్వహించి శాంతి సేవా పురస్కారాలను అందిస్తున్నామన్నారు.

బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి

పెనుకొండ రూరల్: చిలమత్తురు మండలంలోని నల్లబొమ్మనపల్లిలో అత్యాచారానికి గురైన అత్తా,కోడలిని ప్రభుత్వం ఆదుకోవాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఇందులో భాగంగానే సోమవారం పెనుకొండలోని ఆర్డీఓ కార్యాలయంలో సిబ్బందికి వినతి పత్రం అందించారు. నిందితులను కఠినంగా శిక్షించాలని, బాధితులకు ఒకొక్కరికీ రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలన్నారు. ప్రజా సంఘాల నాయకులు ఎంఎస్ మూర్తి, రామాంజినేయులు, శ్రీరాములు, నరసింహులు, పోతులయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా ప్రసాద్

రొళ్ల: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా ప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీఓగా పని చేస్తున్న ఆజాద్ ఇటీవల బదిలీపై రామగిరి వెళ్లారు. రెగ్యులర్ ఎంపీడీఓ పోస్టు ఖాళీగా ఉండటంతో ఉన్నతాధికారులు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏఓగా పని చేస్తున్న ప్రసాద్‌కు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ బాధ్యతలు అప్పగించారు.

నేడు జ్యోతుల ఉత్సవం



లక్ష్మీరంగనాథస్వామి ఉత్సవమూర్తి

అగళి: మండలంలోని నరసంబూది గ్రామంలో వెలసిన లక్ష్మీరంగనాథస్వామికి మంగళవారం జ్యోతుల ఉత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలియజేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఉత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పేదలకు భూమి కేటాయించాలి

పెనుకొండ రూరల్: భూమి లేని నిరుపేదలకు భూమి ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఆర్డీఓ కార్యాలయంలోని డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. గోనిపేట గ్రామంలో నివసిస్తున్న భూమి లేని నిరుపేదలకు భూమిపై హక్కు కల్పించాలన్నారు. పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. కార్యక్రమంలో నాయకులు బాలాస్వామి, నూర్జహాన్, జమున, అరుణ, సరస్వతి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

చౌడేశ్వరీదేవికి గంగపూజ



అలంకరణలో చౌడేశ్వరీదేవి

చిలమత్తూరు: మండలంలోని దేమకేతేపల్లిలో వెలసిన చౌడేశ్వరీదేవికి సోమవారం గంగపూజ నిర్వహించారు. ఉదయం నుంచే అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

- పెనుకొండ ఆర్డీఓ ఆనంద్‌కుమార్

పరిగి: తుపాను ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కోవడానికి అధికార యంత్రాంగం సమన్వయంతో పని చేయాలని పెనుకొండ ఆర్డీఓ ఆనంద్‌కుమార్ తెలిపారు. తుపాను విపత్తు ప్రభావ తీవ్రత, ముందస్తు భద్రతపై తీసుకోవాల్సిన చర్యలపై పరిగి తహసీల్దారు కార్యాలయంలో ఆయన మండల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రధానంగా తుపాను వల్ల కలిగే నష్టాలను అంచనా వేయాలన్నారు. ప్రభావ ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేసి అవసరమైతే పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. పశువులు నష్టపోకుండా పాడి రైతులు జాగ్రత్తలు పాటించాలన్నారు. సాగైన పంట దిగుబడి తడవకుండా సురక్షిత కేంద్రాలకు తరలించుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్యారోగ్యశాఖ అప్రమత్తంగా ఉండాలన్నారు. శిథిలావస్థలో ఉన్న భవనాలు, ఇళ్లలో ఉంటున్న ప్రజలను ఖాళీ చేయించి, పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. పునరావాస కేంద్రాల్లో ఉంటున్న వారికి ఆహారాన్ని అందించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రజలకు ఏదైనా సమస్య ఎదురైతే తహసీల్దారు కార్యాలయంలో ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్లు 99590 14960, 63011 41397 ను సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దారు హసీనా సుల్తానా, ఎంపీడీఓ శ్రీధర్, ఎంఈఓలు లక్ష్మీదేవి, శేషాచలం, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్వరూపరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ ఆనంద్‌కుమార్

సోమందేపల్లి: స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆర్డీఓ ఆనంద్‌కుమార్ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. భారీ వర్షాల నేపథ్యంలో అధికారులకు పలు సూచనలు, సలహాలిచ్చారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ రెడ్డి శేఖర్, ఈఓఆర్డీ, సర్వేయర్, వీఆర్ఓలు పాల్గొన్నారు.



మారెమ్మను ఊరేగిస్తున్న దృశ్యం

కరుణించు మారెమ్మా..

గుడిబండ: దసరా ఉత్సవాల్లో భాగంగా పట్టణ కేంద్రంలో ఉన్న తుమ్మల మారెమ్మ అమ్మవారి విగ్రహ ఉత్సవమూర్తిని భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. సోమవారం ఉదయం నుంచే అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం మేళతాళాలతో ప్రజలు అంగరంగ వైభవంగా మారెమ్మను ఊరేగించారు. తర్వాత పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనుల ప్రారంభం

గుడిబండ: మండల పరిధిలోని కరికెర, దేవరహట్టి గ్రామ పంచాయతీ పరిధిలో పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా ఉపాధి హామీ నిధులతో సిమెంటు రోడ్డు నిర్మాణానికి సోమవారం స్థానిక సర్పంచ్ గౌరమ్మ, ఈఓఆర్డీ నాగరాజునాయక్ భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఏపీఓ భార్గవి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

అమరాపురం: మండలంలోని హేమావతి గ్రామ పంచాయతీ పరిధిలోని గొల్లమారనపల్లిలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఎంపీడీఓ రామరావు ఆధ్వర్యంలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు ఓంకార్‌స్వామి, సర్పంచు తిప్పేస్వామి, ఏపీఓ జగదీష్, టీఏలు, ఎఫ్‌ఏలు తదితర అధికారులు పాల్గొన్నారు.

తమ్ముళ్లకే మద్యం షాపులు

- సిండికేట్‌గా దరఖాస్తులు
- లేపాక్షిలో షాపు దక్కించుకున్న వ్యక్తిని కిడ్నాప్ చేశారని ఫిర్యాదు


హిందూపురం: నియోజకవర్గం పరిధిలో నూతనంగా ఏర్పాటు కానున్న మద్యం దుకాణాలను తమ్ముళ్లే దక్కించుకున్నారు. మొత్తం 9 మద్యం షాపులకు 124 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో హిందూపురం మున్సిపాల్టీలో ఆరు ఉండగా 48 దరఖాస్తులు వేశారు. హిందూపురం రూరల్‌లో 29 దరఖాస్తులు, లేపాక్షిలో ఒక షాపునకు 27 దరఖాస్తులు, చిలమత్తూరు ఒక షాపునకు 20 దరఖాస్తులు వేశారు. వాస్తవంగా కూడా టీడీపీ నాయకులే అధిక సంఖ్యలో దరఖాస్తులు వేశారు. ఇతరులు వేయకుండా ముందస్తుగా ఎమ్మెల్యే ఆఫీసు నుంచి ఆశావహులకు హెచ్చరికలు జారీ చేశారని తెలిసింది. ఒకవేళ ఎవరైనా దరఖాస్తు చేసుకున్నా తమను కాదని నియోజకవర్గంలో వ్యాపారాలు చేసుకోలేరని అల్టిమేటం ఇచ్చారన్న ఆరోపణలున్నాయి.

పక్కా ప్రణాళిక ప్రకారమే..

జిల్లా కేంద్రంలో కలెక్టర్, ఎక్సైజ్ ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో మద్యం షాపుల కేటాయింపునకు సోమవారం లాటరీ తీశారు. ఈ నేపథ్యంలో టీడీపీ నాయకుల ముందస్తు ప్రణాళిక ప్రకారమే వారికే మద్యం షాపులన్నీ దక్కాయి. హిందూపురానికి ఐదు షాపులు కేటాయించగా.. అన్నీ టీడీపీ నాయకులకే దక్కాయి. షాపు నంబర్ 50 నాగరత్నమ్మకు దక్కింది. ఆమె తాను ఎమ్మెల్యేతో మాట్లాడి సిండికేట్‌లో కలుస్తా అన్నట్లు సమాచారం. చిలమత్తూరు షాపు వ్యవహారం కూడా అలాగే జరిగింది. అయితే లేపాక్షి షాపు వ్యవహారం మాత్రం బెడిసి కొట్టింది. అధికార పార్టీ నాయకులను కాదని రంగనాథ్ అనే వ్యక్తి టెండర్ వేశాడు. లాటరీలో లేపాక్షి మండలం షాప్ నంబర్ 57 చిలమత్తూరు మండలం యగ్నిశెట్టిపల్లి గ్రామానికి చెందిన రంగనాథ్‌కు దక్కింది. అతను టీడీపీ సానుభూతి పరుడై అయినా కర్ణాటక మద్యం షాపు నిర్వాహకుడు అతనితో టెండర్ వేయించారని చెబుతున్నారు. రంగనాథ్‌కు లేపాక్షిలో మద్యం షాపు దక్కడంతో అక్కడే ఉన్న టీడీపీ నాయకులు అతని నుంచి బలవంతంగా షాపును రాబట్టుకోవాలని ప్రయత్నించారు. అతన్ని పుట్టపర్తిలోని సాయి ఆరామంలో తీసుకెళ్లి తీవ్రస్థాయి హెచ్చరించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే రంగనాథ్ భార్య అశ్విని పుట్టపర్తి అర్బన్ పోలీసుస్టేషన్‌లో తన భర్తను కిడ్నాప్ చేశారని ఫిర్యాదు చేసింది. తన భర్తను టీడీపీ నాయకుల బారి నుంచి కాపాడాలని పుట్టపర్తిలోనే ధర్నాకు దిగింది. అయితే ఆఖరికి హైడ్రామా మధ్య రంగనాథ్ తనను ఎవరూ కిడ్నాప్ చేయలేదంటూ తెరపైకి వచ్చాడు. ఈ ఒక్క ఎపిసోడ్ తప్పితే మద్యం షాపుల వ్యవహారం అంతా తమ్ముళ్లకే అనుకూలంగా సాగింది.



పుట్టపర్తిలో మద్యం టెండర్ల లాటరీ ప్రక్రియ జరుగుతున్న దృశ్యం



రంగనాథ్ భార్య అశ్విని పుట్టపర్తి పోలీసుస్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

లేపాక్షి: మండలంలోని చోళసముద్రం గ్రామానికి చెందిన ఎరుకుల బాలు ఆదివారం గుండెపోటుతో చనిపోయాడు. విషయం తెలుసుకున్న లేపాక్షి ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమానందన్ సోమవారం మృతుని భార్యకు రూ.10 వేలు ఆర్థికసాయం అందించారు. అలాగే ఎస్సీ కాలనీకి చెందిన రామాంజినప్ప కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో మృతుని భార్య అనితకు రూ. 5 వేలు ఆర్థికసాయం చేశారు.